హించే నదులలో అయిదో అతిపెద్ద నది. పశ్చిమంగా ప్రవహించేవాటిలో అతి పొడవైనది. అందుకే మహానది అని కూడా పిలుస్తుంటారు. గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలలో ప్రవహించే ఈ నది తొలి రెండు రాష్ట్రాలకు అపారమైన జలరాశిని అందిస్తున్నది. ఒక్క మాటలో చెప్పాలంటే గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థ, సామాజిక జీవనం లాంటి వాటిని నర్మద లేకుండా ఊహించలేం. సుమారు లక్ష చదరపు కిలోమీటర్ల నర్మద పరీవాహక ప్రాంతం చాలా వైవిధ్యమైంది, పురాతనమైంది కూడా. దాదాపు 16 కోట్ల సంవత్సరాల కిందట ఉత్తర భారతదేశం, ఇప్పటి ద్వీపకల్పం విడివిడిగా ఉండేవి. వాటిమధ్య ఏర్పడిన లోయలో ప్రవహిస్తున్నదే నర్మద. ఇంత వైవిధ్యమైన పరిస్థితుల మధ్య ఏర్పడింది కాబట్టే నర్మదలోయలో అపారమైన ఖనిజ వనరులు ఉన్నాయి. నర్మద చుట్టూ.. ఆ నదిలో భాగంగా పర్వతశ్రేణులు, జలపాతాలు, లోయలు లాంటి భౌగోళిక అద్భుతాలు కనిపించేందుకు కారణం... అది ఏర్పడిన తీరే. అత్యంత ప్రాచీనమైన జీవనది కాబట్టి ఇక్కడి తీరప్రాంతంలో డైనోసార్ల అవశేషాలూ కనిపించాయి.

### పట్నాలు, పుణ్యక్షేత్రాలు

41 ఉపనదులతో ప్రవహించే నర్మద దారి పొడవునా అనేక ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తూ సాగుతుంది. నర్మద పరీవాహక ప్రాంతంలో ఖనిజాలతో సమృద్ధిగా ఉండే నల్లరేగడి నేలలు ఎక్కువ. జబల్పూర్, దభోయ్, ధర్మపురి, హోర్దా తదితర నగరాలు, పట్టణాలు నర్మద తీరంలో ఉన్నాయి. ఇక నర్మద పొడవునా ఉన్న పుణ్యక్షేత్రాల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి.

### అమర్ కంటక్

దట్టమైన అరణ్యాలలో కనిపించే అరుదైన పుణ్యక్షేత్రం అమర్ కంటక్. నర్మద జన్మస్థానం. అటు వింధ్య, ఇటు సాత్పుర పర్వత శ్రేణుల కూడలి. వేయి మీటర్లకు పైగా ఎత్తున్న ఈ ప్రదేశంలో నది ఉద్భవించే చోటే నర్మదా మాత గుడి ఉంది. ఓవైపు ప్రకృతి అందాలు, మరోవైపు అబ్బురపరిచే శిల్పకళ... ఈ స్థలాన్ని చూసి తీరాల్సిన పుణ్యక్షేత్రంగా మార్చేశాయి. దాదాపు 600కు పైగా అరుదైన జీవజాతులు ఇక్కడ ఉన్నాయని అంచనా. కాళిదాసు, కబీర్ లాంటి మహామహులు ఇష్టపడిన ప్రదేశమిది. వెయ్యేండ్ల క్రితం కామదేవ రాజు నిర్మించిన త్రిముఖి ఆలయం, జైన మందిరం, శంకరాచార్య ఆశ్రమం... లాంటి కట్టడాలెన్నో ఇక్కడ కనిపిస్తాయి. జీవితంలో చూసి తీరాల్సిన పుణ్యక్షేత్రాలంటూ ఉంటే, వాటిలో అమర్ కంటక్ ఒకటని ఒప్పుకొని తీరుతారు భక్తులు.




### ఓంకారేశ్వర్

హైందవ పుణ్యక్షేత్రాలలో జ్యోతిర్లింగాలకు ఉన్న ప్రాముఖ్యాన్ని గురించి ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. వాటిని చూస్తేనే జన్మ తరిస్తుందనే నమ్మకం. వాటిలో ఒకటి నదీ తీరాన, అందులోనూ ఓ ద్వీపం మీద ఉండటం విశేషం. అదే ఓంకారేశ్వరం. ఈ ప్రాంతం ఓంకార రూపంలో ఉండటమే ఆ పేరుకు కారణమని చెబుతారు. దానవులను శిక్షించేందుకు శివుడు ఓంకారేశ్వరుడిగా ఇక్కడ అవతరించాడని స్థల పురాణం. ఇదే ద్వీపం మీద అమలేశ్వరుని పేరుతో మరో శివాలయం ఉంది. శంకరాచార్యుడు తన గురువు గోవింద భగవత్పాదులను ఇక్కడే కలుసుకున్నారన్న నమ్మకానికి సూచనగా, ఆయన విగ్రహం కూడా కనిపిస్తుంది. ఈ ద్వీపానికి కేవలం 140 కిలోమీటర్ల దూరంలోనే మరో జ్యోతిర్లింగ క్షేత్రం ఉజ్జయిని ఉంది.


### జబల్పూర్

పురాణాలు, రాజులు, వలసపాలన, నగరీకరణ, భౌగోళిక వైవిధ్యం... జబల్పూర్ను తల్చుకోగాలనే ఇలాంటి ఎన్నో అంశాలు గుర్తుకొస్తాయి. నర్మద పాలరాళ్లను చీల్చుకుంటూ ఏర్పర్చిన మార్బుల్ రాక్స్, ధువందర్ జలపాతాలు, కొండ మీద కట్టిన మదన్ మహల్ కోట, కన్హా నేషనల్ పార్క్, బార్గి డ్యామ్... లాంటి పర్యటక ప్రదేశాలు చాలానే ఉన్నాయిక్కడ. ఇక ఆలయాల సంగతి సరేసరి. 64 యోగినులను ప్రతిష్ఠించిన చౌసట్ యోగిని ఆలయం ఓ మార్మిక ప్రదేశం. త్రిపుర సుందరి ఆలయం, తాల్ బడా జైన్ మందిర్ లాంటి గుడులు జబల్పూర్లో అడుగడుగునా కనిపిస్తాయి. ప్రపంచ ప్రసిద్ధ ఖజరహో ఆలయాలు ఇక్కడికి 250 కిలోమీటర్ల దూరంలోనే ఉన్నాయి. ఇక్కడి చెరువులు, ఘాట్లు, బ్రిటిష్ కట్టడాలు కూడా చూసి తీరాల్సిందే!



### నెమావర్

చాలా చిన్న ఊరే. కానీ అడుగడుగునా అరుదైన ఆలయాలున్న చోటు. ఇక్కడున్న వెయ్యేండ్ల నాటి సిద్ధనాథ్ ఆలయం వాస్తు శిల్పంలో ఓ అద్భుతం. మారుమూలగా ఉండటం వల్ల, దండయాత్రలను తప్పించుకున్న ఈ ఆలయంలోని శిల్పాలను చెక్కారా, కరిగించారా అన్నంతగా మెలికలు తిరిగి ఉంటాయి. నెమావర్ దగ్గర నర్మద సరిగ్గా సగానికి ఉంటుంది కాబట్టి,





### పరిక్రమ

ఆలయం చుట్టూ ప్రదక్షిణ గురించి విన్నాము, గిరి ప్రదక్షిణ గురించీ విన్నాము... కానీ ఒక నది చుట్టూ ప్రదక్షిణ చేసే అపురూప సంప్రదాయమే నర్మద పరిక్రమ. నర్మద చుట్టూ తిరుగుతూ దాదాపు 2,600 కిలోమీటర్లు సాగే యాత్ర ఇది. అరేబియా సముద్రంలో నర్మద కలిసే స్థానమైన భరూచ్ నుంచి మొదలుపెట్టి, అది ఉద్భవించే అమర్ కంటక్ వరకు వెళ్లి... అక్కడ తీరం మారి వ్యతిరేక దిశలో, తిరిగి భరూచ్ని చేరుకోవడంతో ఈ పరిక్రమ పూర్తవుతుంది. దారి పొడవునా ఉన్న పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటూ, వాటితో ముడిపడి ఉన్న ఇతిహాసాలను తలుచుకుంటూ, స్థానిక సంప్రదాయాలను పాటిస్తూ సాగే అరుదైన యాత్ర ఇది. సాధువులు కాలినడకన చేసే ఈ యాత్రను నేరుగా చేయలేని వారి కోసం, అక్కడి పర్యాటక శాఖ రవాణా సౌకర్యాలు కల్పించింది.